ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
బుధవారం, 16 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 30 | పేజీలు: 4 వెల: 5



## మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఎర్రబెల్లి స్వర్ణ శుభాకాంక్షలు

- టీపీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల ప్రస్థానం విజయవంతం
- కాంగ్రెస్ బలోపేతానికి నాయకత్వం అభినందనీయం
- తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

- పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని చూస్తున్నాం
- అశోక హోటల్ ఎదురుగా త్వరలోనే మల్టీలెవల్ పార్కింగ్
- అండర్ డ్రైనేజీ, వాటర్ వర్క్స్ పనుల ప్రక్రియ మొదలైంది
- వచ్చే 40 ఏళ్లకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం
- భద్రకాళి, వరంగల్ కోట, దేవునూరు గుట్టలపై ప్రత్యేక దృష్టి
- డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి

# హన్మకొండ చౌరస్తా రీడెవలప్‌మెంట్

నగరం పెరుగుతోంది. వాహనాల సంఖ్య పెరుగుతోంది. కాలనీలు విస్తరిస్తున్నాయి. కానీ మౌలిక వసతులు మాత్రం అదే స్థాయిలో ఉంటే సమస్యలు తప్పవు. ఈ నేపథ్యంలో హన్మకొండ నగరానికి భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందిస్తున్నామని హన్మకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్మన్ ఐఏఎస్ చాహత్ బాజ్‌పేయి తెలిపారు. పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణం, హన్మకొండ చౌరస్తా రీడెవలప్‌మెంట్, అండర్ డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా బలోపేతం, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. అశోక హోటల్ ఎదురుగా ఉన్న కుడా స్థలంలో మల్టీలెవల్ పార్కింగ్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, ముందుభాగంలో వాణిజ్య సముదాయాన్ని ఏర్పాటు చేసి ఆదాయం సమకూర్చుకునేలా రూపకల్పన చేస్తున్నామని వెల్లడించారు. మంగళవారం తన చాంబర్‌లో డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో జిల్లా, నగర అభివృద్ధి పనులపై ఆమె వివరాలు వెల్లడించారు. ఈసందర్భంగా కలెక్టర్ వెల్లడించిన వివరాలు ఆమె మాటల్లోనే..!

4



# కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్లే

- అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్
- కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరం
- పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు
- టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకే మాజీ మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తప్పించాల్సి వచ్చిందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కొండా సురేఖ బర్తరఫ్ నిర్ణయం బాధాకరమే అయినప్పటికీ.. వ్యవహారం తీవ్రంగా ఉండటంతో ఏఐసీసీ కఠిన నిర్ణయం తీసుకోక తప్ప లేదని స్పష్టం చేశారు. మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. కొండా సురేఖపై చర్యలు తీసుకోకుండా ఆపేందుకు తాము అధిష్ఠానం వద్ద ప్రయత్నించామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. అయితే పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన అంశం సీరియస్‌గా ఉండటంతో తుది నిర్ణయాన్ని కేంద్ర నాయకత్వమే తీసుకుందని చెప్పారు. పార్టీ లైన్ దాటితే ఎంతటి వారైనా చర్యలు ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి గొడవలు లేవని, అభిప్రాయ భేదాలు వచ్చినా సాయంత్రానికే సరిచేసుకుంటామని అన్నారు.

**కేబినెట్ విస్తరణపై ప్రచారమే**

రాష్ట్రంలో కేబినెట్ విస్తరణపై ప్రస్తుతం ఎలాంటి చర్చ లేదని టీపీసీసీ చీఫ్ తేల్చిచెప్పారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో కొండా సురేఖ, చిన్నారెడ్డికి సంబంధించిన అంశాలపైనే అధిష్ఠానంతో చర్చలు జరిగాయని తెలిపారు.

........(తరువాయి 2లో)






## 22ఏ భూములపై సీఎం కీలక
# కసరత్తు

నేటి అసెంబ్లీ చర్చకు ముందే ఉన్నతస్థాయి సమావేశం

- నిషేధిత జాబితా ప్రక్షాళనపై మంత్రులతో చర్చ
- అర్హమైన భూములను జాబితా నుంచి తొలగించే మార్గాల అన్వేషణ
- భూ యజమానుల సమస్యలకు శాశ్వత పరిష్కారంపై దృష్టి
- రిజిస్ట్రేషన్లలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రుల సమావేశం

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** 22ఏ నిషేధిత భూముల జాబితాపై తెలంగాణ ప్రభుత్వం కీలక కసరత్తు చేస్తోంది. రేపు అసెంబ్లీలో 22ఏ భూముల అంశంపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం ఇవ్వనున్న నేపథ్యంలో, సీఎం పలువురు మంత్రులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్డీ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. 22ఏ జాబితాలో

........(తరువాయి 2లో)



2

## ఎంబీబీఎస్ సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపు

- సెప్టెంబర్ 19 సాయంత్రం 4 గంటలలోపు చేరాలి
- మేనేజ్‌మెంట్ కోటా ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లూ విడుదల
- కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ప్రకటన



2

## 22ఏ భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- లక్షలాది ప్రజల భూ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి
- 47,440 ఎకరాల వివరాలను బహిర్గతం చేయాలి
- బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు

# యూపీఐ చెల్లింపుల్లో కీలక మార్పులు..!

- రూ.2,000 దాటిన కొన్ని లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్
- అక్టోబర్ 15 నుంచి కొత్త విధానం.. ఒక్కో లావాదేవీకి గరిష్ఠంగా రూ.300
- వ్యక్తుల మధ్య చెల్లింపులు ఉచితమే.. చిన్న వ్యాపారులకు జీరో ఎండీఆర్
- రైల్వే, టెలికాం, బీమా, ఇంధన రంగాలకు ఫ్లాట్‌గా రూ.5 ఛార్జీ



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** యూపీఐ చెల్లింపుల విధానంలో కీలక మార్పులకు రంగం సిద్ధమైంది. రూ.2,000కు మించిన కొన్ని యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొత్త విధానాన్ని ప్రకటించింది. ఈ మార్పులు అక్టోబర్ 15, 2026 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే ఈ ఛార్జీని వినియోగదారులపై నేరుగా విధించరాదని స్పష్టం చేసింది. వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ చెల్లింపులు గతంలో మాదిరిగానే

........(తరువాయి 2లో)



హమారా ప్రసాద్‌పై రాజద్రోహం
## కేసు పెట్టాలి

- 'కల్పిత నాయకుడు' పుస్తకాన్ని వెంటనే నిషేధించాలి
- సెప్టెంబర్ 18న పుస్తకావిష్కరణను అడ్డుకుంటాం
- దళిత బహుజన ప్రజా సంఘాల డిమాండ్

3

## బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలి

- సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా సమగ్ర విచారణ జరపాలి
- ఓటును దుర్వినియోగం చేసిన వారిపై అనర్హత వేటు వేయాలి
- కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ఇందిరాశోభన్ ఫిర్యాదు



2



## కాంగ్రెస్‌కు ఎంఐఎం భయం

- అందుకే విమోచన దినోత్సవాన్ని విస్మరణ
- ఓటు బ్యాంక్ రాజకీయాలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఖరి
- నిజాం, రజాకార్ల దౌర్జన్యాలను తెలంగాణ ఎప్పటికీ మర్చిపోదు
- హైదరాబాద్ విముక్తి త్యాగాలను నేటి తరానికి తెలియజేయాలి
- సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు
- మహిళా శక్తి స్కూటీ ర్యాలీకి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి అభినందనలు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ఎంఐఎం భయంతోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు విమర్శించారు. ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం తెలంగాణ చరిత్రను, హైదరాబాద్ విముక్తి

........(తరువాయి 2లో)

# కాంగ్రెస్‌కు ఎంఐఎం భయం




(మొదటిపేజీ తరువాయి)
కోసం పోరాడిన అమరుల త్యాగాలను విస్మరించడం సరికాదన్నారు. నిజాం, రజాకార్ల పాలనలో తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొన్న దౌర్జన్యాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. మహిళా శక్తి స్కూటీ ర్యాలీలో పాల్గొన్న సందర్భంగా ఎన్. రామచందర్‌రావు మాట్లాడారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావడానికి జరిగిన పోరాటం, జాతీయవాదులు చేసిన త్యాగాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ర్యాలీ నిర్వహించిన బీజేపీ మహిళా మోర్చా బృందాన్ని అభినందించారు.

**నిజాం కుట్రలను ప్రజలకు తెలియజేయాలి**

బ్రిటిష్ పాలన నుంచి భారతదేశం స్వాతంత్ర్యం వైపు అడుగులు వేస్తున్న సమయంలో దేశ విభజన చోటుచేసుకుందని, అదే సమయంలో నిజాం నవాబు హైదరాబాద్ విషయంలో కుట్రపూరిత ప్రణాళికలు రచించారని ఎన్. రామచందర్‌రావు పేర్కొన్నారు. హైదరాబాద్‌ను ప్రత్యేక రాజ్యంగా కొనసాగించి, ఉస్మానిస్థాన్‌గా మార్చి పాకిస్థాన్‌తో కలపాలని నిజాం ప్రయత్నించారని విమర్శించారు. నిజాం, రజాకార్ల పాలనలో తెలంగాణ ప్రజలు తీవ్ర అణచివేతకు గురయ్యారని, మహిళలపై జరిగిన దౌర్జన్యాలు అత్యంత కిరాతకంగా ఉన్నాయని తెలిపారు. అయినప్పటికీ తెలంగాణ బిడ్డలు భయపడకుండా నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. ఈ పోరాటంలో ఎందరో జాతీయవాదులు ప్రాణత్యాగాలు చేశారని, వారి త్యాగాల ఫలితంగానే హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనం అయిందన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా గళమెత్తినందుకు షోయబుల్లా ఖాన్‌ను సైతం హత్య చేశారని ఎన్. రామచందర్‌రావు తెలిపారు. తెలంగాణ విమోచన పోరాటంలో పాల్గొన్న యోధుల ధైర్యం, త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. అయితే గత ప్రభుత్వాలు ఆ చరిత్రను గౌరవించడంలో, ప్రజలకు తెలియజేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. తెలంగాణ విమోచన పోరాట చరిత్రను ఎందుకు విస్మరిస్తున్నారని ప్రశ్నించారు. ఎంఐఎం భయంతోనే సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు వెనుకాడుతున్నాయని ఆరోపించారు. రజాకార్ల వారసులుగా పేర్కొంటున్న ఎంఐఎంకు భయపడి చారిత్రక దినోత్సవాన్ని విస్మరించడం బుజ్జగింపు రాజకీయాల్లో భాగమేనని మండిపడ్డారు.

**మహారాష్ట్ర, కర్ణాటకలో ఘనంగా నిర్వహణ**

ఒకప్పుడు హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉన్న ప్రస్తుత మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా గర్వంగా నిర్వహిస్తున్నారని ఎన్. రామచందర్‌రావు గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఈ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడానికి వెనుకాడటం బాధాకరమన్నారు. హైదరాబాద్ విముక్తి కోసం, భారత యూనియన్‌లో పూర్తిస్థాయి విలీనం కోసం లెక్కలేనంత మంది చేసిన త్యాగాలను నేటి యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. చరిత్రను దాచిపెట్టడం వల్ల భవిష్యత్ తరాలకు వాస్తవాలు తెలియకుండా పోతాయని పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ, ప్రతి తరానికీ తెలంగాణ విమోచన చరిత్ర చేరేలా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి నిరంతర కృషితోనే కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం ప్రారంభించిందని ఎన్. రామచందర్‌రావు తెలిపారు. దీంతో హైదరాబాద్ విముక్తి చరిత్రకు తగిన గుర్తింపు లభించిందన్నారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని బీజేపీ దశాబ్దాలుగా డిమాండ్ చేస్తోందని చెప్పారు. తెలంగాణ ప్రజల చరిత్ర, పోరాటం, త్యాగాలకు రాజకీయాలకు అతీతంగా గౌరవం ఇవ్వాలని కోరారు. విమోచన దినోత్సవాన్ని నిర్వహించడం ఏ వర్గానికీ వ్యతిరేకం కాదని, ఇది చారిత్రక వాస్తవాలను గుర్తుచేసుకునే సందర్భమని స్పష్టం చేశారు. మహిళా శక్తి స్కూటీ ర్యాలీ ద్వారా తెలంగాణ విమోచన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన బీజేపీ మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలను ఎన్. రామచందర్‌రావు అభినందించారు. విమోచన పోరాటంలో ప్రాణత్యాగాలు చేసిన అమరుల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17 చారిత్రక ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి, ఆ రోజు త్యాగాలను స్మరించుకోవాలని కోరారు.

# యూపీఐ చెల్లింపుల్లో కీలక మార్పులు!




(మొదటిపేజీ తరువాయి)
ఉచితంగా కొనసాగనున్నాయి. కొత్త విధానం ప్రకారం వ్యక్తి నుంచి వ్యాపారికి జరిగే పర్సన్ టుమర్చంట్ యూపీఐ లావాదేవీల్లో రూ.2,000కు మించిన చెల్లింపులపై 0.4 శాతం ఎండీఆర్ వర్తిస్తుంది. ఒక్కో లావాదేవీకి ఈ ఛార్జీ గరిష్ఠంగా రూ.300కు పరిమితం కానుంది. ఉదాహరణకు రూ.2,000 చెల్లింపుపై 0.4 శాతం ప్రకారం రూ.8 ఎండీఆర్ అవుతుంది. ఈ రుసుము వ్యాపారి వైపు వర్తించేదేనని ఎన్‌పీసీఐ తెలిపింది. రూ.2,000లోపు చెల్లింపులకు ఎండీఆర్ ఉండదు. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే లావాదేవీలపైనా ఎలాంటి ఛార్జీ విధించరు.

**చిన్న వ్యాపారులకు జీరో ఎండీఆర్**

చిన్న వ్యాపారులకు ఎన్‌పీసీఐ ప్రత్యేక ఊరట కల్పించింది. పర్సన్‌టుపర్సన్ మర్చంట్ కేటగిరీలోకి వచ్చే చిన్న విక్రేతలకు జీరో ఎండీఆర్ సౌకర్యం కొనసాగుతుంది. యూపీఐ క్యూఆర్ ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాలో నెలకు రూ.1 లక్ష వరకు చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులు ఈ కేటగిరీలోకి వస్తారు. ప్రస్తుతం యూపీఐ ద్వారా జరిగే మర్చంట్ చెల్లింపుల్లో 95 శాతానికి పైగా రూ.2,000లోపే ఉన్నందున.. మెజారిటీ లావాదేవీలపై కొత్త విధానం ప్రభావం ఉండదని ఎన్‌పీసీఐ పేర్కొంది. రైల్వే, టెలికాం సేవలు, బీమా, ఇంధనం వంటి నిర్దిష్ట వ్యాపార విభాగాల్లో రూ.2,000కు మించిన యూపీఐ చెల్లింపులపై శాతం ఆధారిత ఎండీఆర్‌కు బదులుగా ఒక్కో లావాదేవీకి రూ.5 ఫ్లాట్ ఛార్జీ విధించనున్నారు. తక్కువ లాభ మార్జిన్ ఉన్న సేవా రంగాలపై అధిక భారం పడకుండా ఈ విధానాన్ని తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. వినియోగదారుల నుంచి అదనపు సర్వీస్ ఛార్జీలు వసూలు చేయకుండా బ్యాంకులు, చెల్లింపు సంస్థలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**చిన్న వ్యాపారాల కోసం ప్రత్యేక నిధి**

డిజిటల్ చెల్లింపుల మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని కొత్త ఫ్రేమ్‌వర్క్‌లో ప్రతిపాదించారు. టైర్3, అంతకంటే చిన్న మార్కెట్లలోని వ్యాపారులను యూపీఐ పరిధిలోకి తీసుకురావడం, సైబర్ భద్రతను పెంచడం, వ్యవస్థ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, సాంకేతిక ఆవిష్కరణలకు పెట్టుబడులు పెట్టడం ఈ నిధి లక్ష్యాలుగా ఉన్నాయి. ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయంలో 5 శాతాన్ని యూపీఐ వ్యవస్థ విస్తరణకు వినియోగించనున్నట్లు ఎన్‌పీసీఐ తెలిపింది. క్రెడిట్, డెబిట్ కార్డుల ఛార్జీలతో పోలిస్తే ఈ రుసుములు తక్కువేనని పేర్కొంది.

# ఎంబీబీఎస్ సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపు

- సెప్టెంబర్ 19 సాయంత్రం 4 గంటలలోపు చేరాలి
- మేనేజ్‌మెంట్ కోటా ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లూ విడుదల
- కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ప్రకటన



**కాకతీయ, వరంగల్ :** 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ అడ్మిషన్ల కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపును కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ మంగళవారం విడుదల చేసింది. కాలేజీల వారీగా సీట్ల వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 19 సాయంత్రం 4 గంటలలోపు సంబంధిత కాలేజీల్లో చేరాలి. ఒరిజినల్ సర్టిఫికెట్లు, బాండ్లు, ఇతర పత్రాలను సమర్పించాలి. మేనేజ్‌మెంట్ కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ ఫస్ట్ ఫేజ్ సీట్ల కేటాయింపును కూడా విడుదల చేసింది. ఈ కేటగిరీ విద్యార్థులు సెప్టెంబర్ 19 సాయంత్రం 6 గంటలలోపు అడ్మిషన్లు పూర్తి చేసుకోవాలి. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ షెడ్యూల్ ప్రకారం అకడమిక్ సెషన్ సెప్టెంబర్ 15న ప్రారంభమైందని యూనివర్సిటీ తెలిపింది.




# మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఎర్రబెల్లి స్వర్ణ శుభాకాంక్షలు

- టీపీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల ప్రస్థానం విజయవంతం
- కాంగ్రెస్ బలోపేతానికి నాయకత్వం అభినందనీయం
- తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

**కాకతీయ, హైదరాబాద్:** టీపీసీసీ అధ్యక్షుడిగా 2 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌కు తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం గాంధీభవన్‌లో మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ, మహేష్‌కుమార్‌గౌడ్ నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమైందని కొనియాడారు. కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో ఆయన చూపిస్తున్న చొరవ అభినందనీయమన్నారు. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదిగిన మహేష్‌కుమార్‌గౌడ్ ప్రస్థానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయడంలో ఆయన ముందుండటం ప్రశంసనీయమన్నారు. మహిళా కాంగ్రెస్ తరఫున ఎల్లప్పుడూ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. రాబోయే రోజుల్లోనూ ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరిన్ని విజయాలు సాధించాలని, మహేష్‌కుమార్‌గౌడ్ ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# 22ఏ భూములపై శ్వేతపత్రం విడుదల చేయాల

- లక్షలాది ప్రజల భూ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి
- 47,440 ఎకరాల వివరాలను బహిర్గతం చేయాలి
- బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు



**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్య తీవ్రతకు చేరుకున్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలమైందని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. న్యూఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీ సమావేశాల్లో 22ఏ భూములపై చారిత్రాత్మక నిర్ణయం వస్తుందని ప్రజలు ఆశించినా నిరాశే మిగిలిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో కోటి ఎకరాలకు పైగా భూములను అడ్డగోలుగా 22ఏ జాబితాలో చేర్చిన అధికారులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కనీస సన్నాహాలు లేకుండా సభకు వచ్చి అరకొర సమాచారంతో సమాధానం ఇచ్చేందుకు ప్రయత్నించారని విమర్శించారు. మంత్రి ప్రస్తావించిన 47,440 ఎకరాలు ఏ గ్రామాల్లో ఉన్నాయో వెల్లడించాలని, మిగిలిన భూములపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**హైకోర్టు సిట్టింగ్ జడ్జితో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి**

ధరణి, భూభారతి లొసుగుల వల్ల నష్టపోయిన పేదలకు న్యాయం చేసేందుకు తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జితో ప్రత్యేక కమిటీ నియమించాలని కోరారు. ప్రజా సమస్యలపై నిలదీస్తే బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనంటూ రేవంత్ సర్కార్ బురదజల్లే రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే తొలి కేబినెట్ సమావేశంలోనే భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని రఘునందన్‌రావు స్పష్టం చేశారు.

# 22ఏ భూములపై సీఎం కీలక కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)
ఉన్న భూముల కారణంగా ప్రజలు, భూయజమానులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, అర్హమైన భూములను జాబితా నుంచి తొలగించే అంశంపై మంత్రులతో సీఎం చర్చించారు. అనవసరంగా నిషేధిత జాబితాలో చేరిన భూముల విషయంలో భూ యజమానులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే మార్గాలను అన్వేషించడంపై దృష్టి సారించారు. భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా సమావేశంలో ప్రస్తావించారు. అర్హత ఉన్న భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోకుండా, నిషేధిత జాబితా కారణంగా నిజమైన భూయజమానులు నష్టపోకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమాలోచనలు చేశారు.

**అసెంబ్లీ సమాధానంపై తుది కసరత్తు**

రేపటి అసెంబ్లీ చర్చలో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని వెల్లడించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే వివిధ శాఖల నుంచి అందిన సమాచారాన్ని, 22ఏ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, భూ పరిపాలనకు సంబంధించిన అంశాలపై మంత్రుల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. సభలో సభ్యులు లేవనెత్తే ప్రశ్నలకు సమగ్ర సమాధానం ఇచ్చేలా తుది కసరత్తు కొనసాగించారు. గతంలో 22ఏ భూముల విషయంలో జరిగిన పరిణామాలు, ప్రస్తుతం నెలకొన్న సమస్యలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సభలో వివరించే అవకాశం ఉంది. నిషేధిత జాబితా రూపకల్పన, భూముల చేర్పులు, తొలగింపులు, రిజిస్ట్రేషన్లకు సంబంధించిన విధానాలపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయనుంది.

**గత ప్రభుత్వ నిర్ణయాలపై ప్రస్తావనకు అవకాశం**

22ఏ భూముల వ్యవహారంలో అసలు సమస్యకు కారణాలేంటి, గతంలో భూముల కేటాయింపులు, రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయి, ఎవరి హయాంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు అనే అంశాలను సభా వేదికగా వివరించాలని సీఎం భావిస్తున్నట్లు సమాచారం. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న భూ అక్రమాల అంశాన్ని కూడా రేపటి చర్చలో ప్రస్తావించే అవకాశం ఉంది. ప్రతిపక్షాలు 22ఏ జాబితా విషయంలో చేస్తున్న విమర్శలకు ఏ విధంగా సమాధానం ఇవ్వాలి, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలకు ఎలా వివరించాలి అనే అంశాలపైనా మంత్రులతో సీఎం చర్చించారు. ఒకవైపు గతంలో జరిగిన పరిణామాలను సభలో ప్రస్తావించడంతో పాటు, మరోవైపు ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపించే విధానాన్ని వెల్లడించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

**సామాన్యులకు వెసులుబాటు కల్పించేలా చర్యలు**

మొత్తంగా 22ఏ నిషేధిత భూముల జాబితా ప్రక్షాళన, భూ యజమానుల సమస్యల పరిష్కారం, రిజిస్ట్రేషన్లకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించే అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. అర్హమైన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించడం, నిజమైన భూ యజమానులకు న్యాయం చేయడం, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా స్పష్టమైన విధానం రూపొందించడంపై కసరత్తు జరుగుతోంది. రేపటి అసెంబ్లీ చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, భవిష్యత్ కార్యాచరణ, గతంలో చోటుచేసుకున్న పరిణామాలపై సమగ్ర వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

# కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్లే

(మొదటిపేజీ తరువాయి)
మంత్రివర్గ విస్తరణ పూర్తిగా సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ అధిష్ఠానం నిర్ణయమని పేర్కొన్నారు. బీసీలకు కేబినెట్‌లో 5 స్థానాలు ఇవ్వాలని తాను కోరినట్లు చెప్పారు. తన నాయకత్వంలో తెలంగాణ కాంగ్రెస్ ఏఐసీసీ ర్యాంకింగ్స్‌లో దేశంలోనే నెంబర్ వన్ స్థానానికి చేరిందని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 14-15 సీట్లు గెలవడమే లక్ష్యమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో నిజామాబాద్ నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమన్నారు.

**పేదలకు రేషన్ కార్డులు ఇచ్చాం**

గత కేసీఆర్ ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత లక్షలాది మంది పేదలకు రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఫోర్త్ సిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. హైడ్రా రాకతో భూకబ్జాదారులు, ఆక్రమణదారుల్లో భయం మొదలైందని, చెరువులను ఆక్రమణల నుంచి కాపాడటంలో హైడ్రా విజయం సాధించిందని అన్నారు. కులగణన సర్వే ఫలాలు అందరికీ అందితే సామాజిక న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలి

- సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా సమగ్ర విచారణ జరపాలి
- ఓటును దుర్వినియోగం చేసిన వారిపై అనర్హత వేటు వేయాలి
- కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ఇందిరాశోభన్ ఫిర్యాదు

**కాకతీయ, హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో మహిళా పోలీసులు, అధికారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ఇందిరా శోభన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డికి లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. బాధ్యులపై అనర్హత వేటు వేసి, వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకోవాలని కోరారు. ఈ నెల 7న నిరసన పేరుతో టీషర్టులు విప్పి అర్ధనగ్నంగా ప్రదర్శనకు దిగడం, పోలీసు అధికారుల కాలర్లు పట్టుకుని దాడికి యత్నించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ఆర్టికల్ 14, 15, 21ల స్ఫూర్తిని ఉల్లంఘించిన ఘటనగా పరిగణించాలని కోరారు. సీసీటీవీ ఫుటేజీలు, వీడియోల ఆధారంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మహిళా నాయకులు రేణుక గౌడ్, రజని, జోత్స్న పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారంలో జాప్యం వద్దు

- బాధితులకు సత్వర న్యాయం అందించాలి
- రాజన్న జోన్-3 డీఐజీ సన్‌ప్రీత్ సింగ్




**కాకతీయ, కరీంనగర్ :** పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని రాజన్న జోన్3 డీఐజీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం కరీంనగర్ టౌన్ ఏసీపీ కార్యాలయంలో నేరాల రికార్డులు, పెండింగ్ కేసులు, సీసీటీఎన్ఎస్ నిర్వహణ, శాంతిభద్రతల పరిస్థితిపై కమిషనర్ గౌస్ ఆలంతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని సూచించారు. రానున్న వినాయక చవితి వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ సి.హెచ్. వెంకటస్వామి, టౌన్ ఇన్‌స్పెక్టర్లు రామచందర్ రావు, తిరుమల్, పుల్లయ్యలతో పాటు డివిజన్ పరిధిలోని ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మండల స్థాయి క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులు

**శంకరపట్నంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో పోటీలు**



**కాకతీయ, శంకరపట్నం :** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలు మంగళవారం కేశవపట్నం జెడ్పీహెచ్ఎస్‌లో విజయవంతంగా ముగిశాయి. అండర్-14, అండర్-17 బాలికల విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 16నుంచి 19వ తేదీ వరకు కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని మండల క్రీడా కార్యదర్శి ఆడెపు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు భక్తురాజ్ కుమార్, వాసుదేవ్, అంజలి, జగబ్బీర్ సింగ్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాలికపై వేధింపులు.. నిందితుడికి జ్యుడీషియల్ రిమాండ్

**కాకతీయ, శంకరపట్నం:** మైనర్ బాలికను వివాహం చేసుకుంటానంటూ వేధించిన రేకుర్తికి చెందిన నగుర్ రవిని కేశవపట్నం పోలీసులు అరెస్ట్ చేశారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితుడిని మంగళవారం న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా.. 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. మైనర్ బాలికల భద్రతకు భంగం కలిగించేలా వ్యవహరించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కేశవపట్నం ఎస్ఐ శేఖర్‌రెడ్డి హెచ్చరించారు.

## ప్రతి విద్యార్థికి కంటి పరీక్ష తప్పనిసరి

- దృష్టి లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించాలి
- డీఎంహెచ్‌ఓ డా. బి. రాజారెడ్డి

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బి. రాజారెడ్డి సూచించారు. కాశీబుగ్గలోని నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న పాఠశాల ఐ స్క్రీనింగ్ ఎస్ఈఎస్-2026 శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. ఐ. ప్రకాష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. గుర్తించిన విద్యార్థులను వెంటనే నేత్ర వైద్య కేంద్రాలకు రిఫర్ చేసి, ఫాలోఅప్ నిర్వహించాలని ఆదేశించారు. స్క్రీనింగ్ వివరాలను సక్రమంగా నమోదు చేసి, నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఆర్‌బీఎస్‌కే వైద్యులు, ఆప్టోమెట్రిస్టులు, పాఠశాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యులు డా. శ్రీనివాస్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వేశ్వరయ్య సేవలు మరువలేనివి

**కాకతీయ, ఇనుగుర్తి:** భారతదేశానికి మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన సేవలు మరువలేనివని వాగ్దేవి కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ చిన్నాల కట్టయ్య అన్నారు. ఇనుగుర్తి మండల కేంద్రంలోని పాఠశాలలో మంగళవారం విద్యార్థుల మధ్య ఇంజనీరింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టయ్య మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూసీ నది ప్రక్షాళనకు అప్పుడే రూపకల్పన చేసిన మహనీయుడని, ఆయన సేవలను గుర్తించిన బ్రిటిష్ ప్రభుత్వం 'సర్' బిరుదుతో సత్కరించిందన్నారు. భారత ప్రభుత్వం 'భారతరత్న'తో గౌరవించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శిరీష, అప్సర, నవ్య, షాహిన్, శ్రీలత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన బంధు హామీ ఏమైంది?

- గిరిజన హామీలపై కాంగ్రెస్ స్పష్టత ఇవ్వాలి
- బీఆర్ఎస్ నల్లబెల్లి మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి



**కాకతీయ, నల్లబెల్లి :** గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నల్లబెల్లి మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి అన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన గిరిజన బంధు పథకం, ఎస్టీ కార్పొరేషన్ల ఏర్పాటుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనుల అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎన్ని నిధులు కేటాయించింది, ఎన్ని పనులు చేపట్టిందో ప్రజలకు వెల్లడించాలని కోరారు. గిరిజన హామీలను వెంటనే అమలు చేసి ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకపోతే గ్రామగ్రామాన ప్రజలను చైతన్యపరిచి ప్రభుత్వాన్ని నిలదీస్తామని బానోత్ సారంగపాణి హెచ్చరించారు.

## ఎంఓపీ ఎరువుల బస్తాలపై తనిఖీ

- నాణ్యతపై ఫిర్యాదులతో శాంపిళ్ల సేకరణ
- నమూనాలను ప్రయోగశాలకు పంపిన అధికారులు
- మండల వ్యవసాయ అధికారి బన్న రజిత వెల్లడి



**కాకతీయ, నల్లబెల్లి:** ఎంఓపీ ఎరువుల నాణ్యతపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో నల్లబెల్లి మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్‌లో మండల వ్యవసాయ అధికారి బన్న రజిత శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఎరువుల బస్తాలను పరిశీలించి నమూనాలను సేకరించారు. సేకరించిన శాంపిళ్లను నాణ్యత నిర్ధారణ కోసం ప్రయోగశాలకు పంపించారు. పరీక్ష ఫలితాలు వచ్చిన అనంతరం తదుపరి విచారణ చేపట్టి, నివేదిక ఆధారంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఎరువుల కొరతను అరికట్టడంతో పాటు అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అవసరం లేని పురుగుమందులను ఎరువుల బస్తాలతో కలిపి విక్రయిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో మండలంలోని అన్ని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం

**వరంగల్ కలెక్టర్ సత్యశారద**

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ డా. సత్యశారద అన్నారు. జాతీయ ఇంజినీర్స్ డే సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ఇంజినీర్లకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆధునిక సేవలు అందించడంలో ఇంజినీర్లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా ఇంజినీర్లు పాల్గొన్నారు.

## తండ్రి జ్ఞాపకార్థం 100 కుర్చీల వితరణ

**కాకతీయ, పెద్దవంగర:** మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం పోచారం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త బానోత్ నీలసురేందర్ నాయక్ తన తండ్రి బానోత్ బిక్షం నాయక్ జ్ఞాపకార్థం గ్రామ పంచాయతీ కార్యాలయానికి రూ.30 వేల విలువైన 100 కుర్చీలను మంగళవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పరిపాలన బలోపేతమైతేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కుర్చీలు పంచాయతీ పాలకవర్గానికి ఉపయోగపడాలని, గ్రామాభివృద్ధికి భవిష్యత్తులోనూ తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సీతారాం నాయక్, మాజీ సర్పంచ్ వెంకన్న నాయక్, మద్దెల యాకన్న, సారయ్య, కర్ణాకర్, వెంకన్న, శంకర్ నాయక్, హర్ల తదితరులు పాల్గొన్నారు.

# హమారా ప్రసాద్‌పై రాజద్రోహం కేసు పెట్టాలి

- 'కల్పిత నాయకుడు' పుస్తకాన్ని వెంటనే నిషేధించాలి
- సెప్టెంబర్ 18న పుస్తకావిష్కరణను అడ్డుకుంటాం
- దళిత బహుజన ప్రజా సంఘాల డిమాండ్



**కాకతీయ, హన్మకొండ :** డా. బీఆర్ అంబేద్కర్‌ను కించపరుస్తూ 'కల్పిత నాయకుడు' పుస్తకాన్ని ప్రచురిస్తున్న హమారా ప్రసాద్‌పై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రాజద్రోహం కేసు నమోదు చేసి తీహార్ జైలుకు పంపాలని దళిత బహుజన ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. పుస్తకాన్ని నిషేధించి, విడుదలను అడ్డుకోవాలని కోరాయి. మంగళవారం హనుమకొండలోని డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ విగ్రహాల పరిరక్షణ కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ బండి అశోక్ అధ్యక్షతన నిరసన, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల బాధ్యులు మాట్లాడుతూ హమారా ప్రసాద్‌ను బీజేపీ నాయకులు ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. సెప్టెంబర్ 18న హైదరాబాద్‌లో జరగనున్న పుస్తకావిష్కరణను అడ్డుకుంటామని హెచ్చరించారు. రిజర్వేషన్ల ఫలాలతో చట్టసభల్లో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు స్పందించాలని డిమాండ్ చేశారు. సుమారు అరగంట రాస్తారోకోతో ట్రాఫిక్ స్తంభించింది. సుబేదారి సీఐ ఎం. రంజిత్‌కుమార్, ట్రాఫిక్ సీఐ వెంకన్న చర్చించడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో జోరిక రమేష్, దామెర నర్సయ్య, రౌతు రమేష్, చుంచు రాజేందర్, పెరుమాండ్ల రామకృష్ణ, అరూరి సాంబయ్య, కొండ్ర నర్సింగరావు, కడారి కుమార్, ప్రభాకర్, దండ్రి శ్రీనివాస్, పనికేల శ్రీనివాస్, మంద వీరస్వామి, సాధు కుమారస్వామి, సింగారపు రవిప్రసాద్, మాదాసు సురేష్, పోతుల కొమ్మలు, అంకుస్ రవి, కేడల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

- సహజ వనరులతో స్థిరమైన సాగు సాధ్యం
- జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర
- 125 మంది రైతులకు శిక్షణ, వ్యవసాయ కిట్ల పంపిణీ

**కాకతీయ, వరంగల్ బ్యూరో:** ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర అన్నారు. నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ పథకం కింద మడిపల్లి రైతు వేదికలో జయగిరి, లక్నవరం, మడిపల్లి గ్రామాలకు చెందిన 125 మంది రైతులకు శిక్షణ ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారి అద్లూరి అనురాధ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విజయ్ చంద్ర మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సహజ వనరులతో స్థిరమైన వ్యవసాయం చేయవచ్చన్నారు. ఏడీఏ ఆదిరెడ్డి మాట్లాడుతూ పశువుల ఎరువు, పంట అవశేషాలు, వేపతో సాగు ఖర్చులు తగ్గుతాయన్నారు. రిసోర్స్ పర్సన్ హుస్సేన్ నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, పంచగవ్య, వావిలాకు కషాయం, అగ్నాస్త్రం, వేస్ట్ డీకంపోజర్, దశపర్ణి కషాయం తయారీ విధానాలను ప్రదర్శించారు. అనంతరం 125 మంది రైతులకు వ్యవసాయ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ సుమన్, సర్పంచ్ రంజిత్, సీఆర్‌పీలు రమ్య, రవళి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## కార్యాలయాలకే పరిమితం కావొద్దు



- ప్రజల్లోకి వెళ్లి సమస్యలను పరిష్కరించాలి
- గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి
- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఆదేశం

**కాకతీయ, రాయపర్తి/పాలకుర్తి:** అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాయపర్తి మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, వ్యవసాయం, సాగునీరు, పింఛన్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్షించారు. పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, సంక్షేమ పథకాలు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులకు అందేలా చూడాలని అన్నారు. మండల సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పెరికేడు గ్రామానికి చెందిన రైతు బాషబోయిన కుమార్ అగ్నిప్రమాదంలో పంట, వ్యవసాయ పనిముట్లు కోల్పోయిన నేపథ్యంలో మంజూరైన రూ.2,00,000 సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఆపదలో ఉన్న ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.




## వాడుకలోకి వైకుంఠ రథం

- వార్తా కథనానికి అధికారుల తక్షణ స్పందన

**కాకతీయ, రాయపర్తి:** 'కాకతీయ' కథనానికి అధికారులు స్పందించారు. గత కొంతకాలంగా మూలనపడి నిరుపయోగంగా ఉన్న వైకుంఠ రథానికి మరమ్మతులు పూర్తి చేసి వాడుకలోకి తీసుకొచ్చారు. సెప్టెంబర్ 1న 'ఉత్తరం కాకతీయ' దినపత్రికలో 'మూలనపడి మూలుగుతున్న వైకుంఠ రథం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన స్థానిక సర్పంచ్ గారె సహేంద్ర బిక్షపతి, పంచాయతీ కార్యదర్శి గుగులోత్ యాకుబ్ నాయక్ వాహనంలోని సాంకేతిక లోపాలను సరిచేయించారు. వైకుంఠ రథం అందుబాటులో లేక గతంలో అంతిమయాత్రలకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోయామని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం వాహనం అందుబాటులోకి రావడంతో హర్షం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించిన పంచాయతీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పంచాయతీలో ఉన్న ఫ్రీజర్ బాక్స్‌ను కూడా ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.



## ఇనుగుర్తి మండల ప్రెస్‌క్లబ్ ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షుడిగా కుంభం మహేందర్‌రెడ్డి

**కాకతీయ, ఇనుగుర్తి:** ఇనుగుర్తి మండల నూతన ప్రెస్‌క్లబ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుంభం మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా షేక్ యాకుబ్ పాషా, ప్రధాన కార్యదర్శిగా దార్ల భాస్కర్, కోశాధికారిగా జాటోత్ సంతోష్, సంయుక్త కార్యదర్శిగా కూటికంటి మధును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గాదుదుల గణేష్, పల్లె రాజు, మోహన్, ప్రభాకర్, బిక్షపతి పాల్గొన్నారు.

# సంప్రదాయ నృత్యకళలకు పన్నెండేళ్ల ప్రస్థానం

- రవీంద్రభారతిలో ఘనంగా పన్నెండు వసంతాల కళాప్రస్థానం
- పేరిణి, ఆంధ్ర నాట్య ప్రదర్శనలతో అలరించిన విద్యార్థులు

**కాకతీయ, హైదరాబాద్ :** సంప్రదాయ నృత్యకళలను పరిరక్షిస్తూ శ్రీ చంద్ర కళా నిలయం నిర్వహిస్తున్న కళాప్రస్థానం పన్నెండేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా పన్నెండు వసంతాల కళాప్రస్థానం కార్యక్రమం మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రధాన వేదికపై ఘనంగా జరిగింది. సుమారు 100 మంది విద్యార్థులు పేరిణి నాట్యం, ఆంధ్ర నాట్యంలోని వివిధ నృత్యాంశాలను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కుంభ హారతి, పేరిణి పాత్ర ప్రవేశం, దశరథ రామ గోవింద, బ్రహ్మ గద్య, శివ కైవరం, సంధ్యా సమయము, శబ్ద పల్లవి, సాహిత్య పల్లవి తదితర నృత్యాంశాలను విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శించారు. ప్రదర్శనల్లో గురుశిష్య పరంపర, సంప్రదాయ నృత్యరీతుల వైభవం ప్రతిబింబించింది. ముఖ్య అతిథిగా హాజరైన కంచర్ల శ్రీనివాస్‌రావు విద్యార్థులను ఆశీర్వదించారు. భక్త రామదాసు పదవ తరం వారసుడిగా గుర్తింపు పొందిన ఆయనతో పాటు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత పేరిణి రాజ్‌కుమార్, ప్రముఖ సినీ గేయ రచయిత మల్లికవల్లభ, సురభి నాటక కళాకారుడు, మేకప్ ఆర్టిస్ట్ సురభి దినకర్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జనగామ, ఆలేరు, బచ్చన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్, నిజామాబాద్ తదితర ప్రాంతాల విద్యార్థులు పాల్గొన్నారు.




## ఉద్యమకారుల హక్కుల సాధనకు ఐక్యంగా కదలాలి

- ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ గుడిమల్ల రవికుమార్

**కాకతీయ, హనుమకొండ:** తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు, హక్కుల సాధన కోసం నిర్వహించనున్న ఓదార్పు యాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర చైర్మన్, ప్రముఖ న్యాయవాది గుడిమల్ల రవికుమార్ నేతృత్వంలో చేపట్టనున్న యాత్ర పోస్టర్‌ను మంగళవారం ఎర్రగట్టుగుట్ట సర్కిల్‌లో ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జీల సమక్షంలో హసన్‌పర్తి మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేకల కన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా సౌరం రవీందర్, ఉపాధ్యక్షులుగా గోపనబోయిన రవీందర్, మెరుగుత్తి రఘు, ఆరెపల్లి రాజు, తంగేళ్లపెల్లి కోటేశ్వర్ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా రుద్రారపు రవీందర్, దాట్ల ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. మహిళా కమిటీ అధ్యక్షురాలిగా మోతపోతుల లక్ష్మి, ఉపాధ్యక్షులుగా సిరిమల్ల గాయత్రి, కందగట్ల రమ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో అనుముల రమేష్, మొగసాల దేవేందర్‌రెడ్డి, గోపనబోయిన రాజు, మేకల రవీందర్, ఇమ్మడి శెట్టి రాజు, సౌరం స్వర్ణలత, గుంటి పద్మ, దార సూరి, బెరిగేలా కృష్ణమూర్తి, బైరి రమేష్, జక్కుల స్వామి, జీనుకల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన రిజర్వేషన్ల పెంపు కేసీఆర్ ఘనతే

- గిరిజనుల అభివృద్ధికి బీఆర్ఎస్ పెద్దపీట
- కాంగ్రెస్ హామీలపై స్పష్టత ఇవ్వాలి
- బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి

**కాకతీయ, ములుగు ప్రతినిధి :** గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి అన్నారు. మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. గిరిజనుల కోసం ప్రత్యేక అభివృద్ధి నిధికి చట్టబద్ధత కల్పించి, 2022-23లో రూ.13,412.63 కోట్లు, 2023-24లో రూ.15,232.62 కోట్లు కేటాయించామని తెలిపారు. 'గిరి వికాసం' ద్వారా 19,698 మంది రైతులకు చెందిన 56,613 ఎకరాలను సాగులోకి తీసుకొచ్చామన్నారు. ములుగు నియోజకవర్గంలో 7,700కు పైగా పోడు పట్టాలు, ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలో 3,500కు పైగా బోర్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఎస్టీ డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17న గిరిజన ఆవాసాల్లో ర్యాలీలు నిర్వహించి కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేయాలని పిలుపునిచ్చారు.

### అశోక హోటల్ వద్ద మల్టీలెవల్ పార్కింగ్

హన్మకొండలో ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. రోడ్లపైనే వాహనాలను నిలిపివేయాల్సి రావడంతో ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. దీనికి పరిష్కారంగా అశోక హోటల్‌కు ఎదురుగా ఉన్న కుడా స్థలంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నాం. పార్కింగ్ నిర్మాణానికి మాత్రమే స్థలాన్ని పరిమితం చేయకుండా, ముందుభాగంలో వాణిజ్య దుకాణాలను ఏర్పాటు చేసి లీజుకు ఇవ్వాలనే ఆలోచన ఉంది. వాణిజ్య సముదాయం ద్వారా ఆదాయం సమకూర్చుకుని పార్కింగ్ నిర్వహణకు వినియోగించేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం. నగరంలోని కీలక ప్రాంతాల్లో వాహనాల రద్దీని తగ్గించడంతో పాటు వ్యాపారులకు, ప్రజలకు సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ ప్రాజెక్టు అమలైతే హన్మకొండలో పార్కింగ్ సమస్యకు కొంతవరకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉంది.

### హన్మకొండ చౌరస్తాకు కొత్త రూపం

హన్మకొండ చౌరస్తాను సమగ్రంగా అభివృద్ధి చేసే ప్రతిపాదనపై కసరత్తు జరుగుతోంది. ఆర్టీసీ బస్‌స్టేషన్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న ఖాళీ స్థలాలను కలుపుకొని ప్లాజా తరహా అభివృద్ధి చేపట్టే అంశంపై ఆర్టీసీ అధికారులతో చర్చలు కొనసాగుతున్నాయి. ఈ ప్రతిపాదనను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లాం. చౌరస్తా అభివృద్ధిలో రవాణా సౌకర్యాలు, పార్కింగ్, పాదచారుల కదలిక, వాణిజ్య వసతులు వంటి అంశాలను సమన్వయం చేయనున్నాం. హన్మకొండ చౌరస్తా నగరానికి ప్రధాన ప్రవేశ ప్రాంతంగా ఉన్నందున దాని రూపురేఖలు మార్చాల్సిన అవసరం ఉంది. మల్టీలెవల్ పార్కింగ్, ప్లాజా నిర్మాణం వంటి పనులు పూర్తయితే ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు చౌరస్తాకు కొత్త ఆకర్షణ వస్తుంది.

### అండర్ డ్రైనేజీకి రూ.5 వేల కోట్ల ప్రణాళిక

హన్మకొండ, కాజీపేట, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు భారీ ప్రాజెక్టును చేపడుతున్నాం. సుమారు రూ.5 వేల కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నాం. ప్రస్తుతం గ్రౌండ్ వర్క్ కొనసాగుతోంది. అవసరమైన భూముల గుర్తింపు ప్రక్రియలో భాగంగా దాదాపు 10 ఎకరాల స్థలాన్ని ఇప్పటికే గుర్తించాం. వర్షపు నీరు, మురుగునీటి నిర్వహణకు శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా ప్రాజెక్టును దశలవారీగా అమలు చేస్తాం. నగర విస్తరణ, పెరుగుతున్న జనాభా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అండర్ డ్రైనేజీ వ్యవస్థను రూపొందిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చిందని, సంబంధిత అధికారులు తదుపరి ప్రక్రియపై పరిశీలన చేస్తున్నారు. ముంపు సమస్యకు తరచూ గురయ్యే ప్రాంతాలకు ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.

### తాగునీటి సరఫరాకు రూ.500 కోట్లు

గ్రేటర్ వరంగల్ వాటర్ వర్క్స్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.500 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో రాబోయే 30 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాగునీటి వ్యవస్థను బలోపేతం చేయనున్నాం. కొత్త పైపులైన్ల నిర్మాణం, పాత పైపులైన్ల మరమ్మతులు, నీటి సరఫరా వ్యవస్థ విస్తరణ, కొత్త వాటర్ ట్యాంకులు, వాటర్ ప్లాంట్ల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నాం. నగరంలోని ప్రస్తుత అవసరాలను మాత్రమే కాకుండా 30 నుంచి 40 ఏళ్ల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తున్నాం. కాలనీల విస్తరణకు అనుగుణంగా నీటి సరఫరా పెంచడం, చివరి ప్రాంతాలకూ తాగునీరు అందించడం, పాత పైపులైన్ల వల్ల ఏర్పడే సమస్యలను పరిష్కరించడం ఈ పనుల్లో ప్రధాన భాగమే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలోనే ఈ పనులకు ప్రారంభోత్సవం చేయనున్నారు.

**నగరం పెరుగుతోంది. వాహనాల సంఖ్య పెరుగుతోంది. కాలనీలు విస్తరిస్తున్నాయి. కానీ మౌలిక వసతులు మాత్రం అదే స్థాయిలో ఉంటే సమస్యలు తప్పవు. ఈ నేపథ్యంలో హన్మకొండ నగరానికి భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందిస్తున్నామని హన్మకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్మన్ ఐఏఎస్ చాహత్ బాజ్‌పేయి తెలిపారు. పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణం, హన్మకొండ చౌరస్తా రీడెవలప్‌మెంట్, అండర్ డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా బలోపేతం, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. అశోక హోటల్ ఎదురుగా ఉన్న కుడా స్థలంలో మల్టీలెవల్ పార్కింగ్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, ముందుభాగంలో వాణిజ్య సముదాయాన్ని ఏర్పాటు చేసి ఆదాయం సమకూర్చుకునేలా రూపకల్పన చేస్తున్నామని వెల్లడించారు. మంగళవారం తన చాంబర్‌లో డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో జిల్లా, నగర అభివృద్ధి పనులపై ఆమె వివరాలు వెల్లడించారు. ఈసందర్భంగా కలెక్టర్ వెల్లడించిన వివరాలు ఆమె మాటల్లోనే..!**



### ఇళ్లతో పాటు మౌలిక వసతులపైనా దృష్టి

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ వందశాతం పూర్తయింది. కొన్ని ప్రాంతాల్లో నీటి వసతి, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని లబ్ధిదారులు దృష్టికి తీసుకొస్తున్నారు. అంబేద్కర్‌నగర్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కార్పొరేషన్ అధికారులు టెండర్లు పిలిచారు. త్వరలో పనులు పూర్తవుతాయి. కేటాయించిన ఇళ్లలో లబ్ధిదారులు నివసిస్తున్నారా లేదా అనే అంశంపై ఆక్యుపెన్సీ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నాం. అర్హులైన వారు ఇళ్లను వినియోగించుకునేలా చూడటమే ఈ ప్రక్రియ ఉద్దేశం. ఇళ్ల నిర్మాణంతో పాటు నీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్య సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

### అర్హులైన ఓటర్ల పేర్లు తొలగకుండా చర్యలు

ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోంది. దీనిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాం. బూత్ లెవల్ అధికారులు ప్రజలకు వివరాలు తెలియజేస్తున్నారు. ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని సవరణలు అవసరమైతే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచిస్తున్నాం.

# హన్మకొండ చౌరస్తా రీడెవలప్‌మెంట్

## పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని చూస్తున్నాం

## అశోక హోటల్ ఎదురుగా త్వరలోనే మల్టీలెవల్ పార్కింగ్

అండర్ డ్రైనేజీ, వాటర్ వర్క్స్ పనుల ప్రక్రియ మొదలైంది
వచ్చే 40 ఏళ్లకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం
భద్రకాళి, వరంగల్ కోట, దేవునూరు గుట్టలపై ప్రత్యేక దృష్టి
డిజిటల్ మీడియా ప్రతినిధులతో
చిట్‌చాట్‌లో హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి



### భద్రకాళి, వరంగల్ కోటకు పర్యాటక హంగులు

భద్రకాళి ఆలయ అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.90 కోట్ల ఎస్డీపీ నిధులు కేటాయించింది. ఈ నిధులతో చేపట్టాల్సిన పనులు కొనసాగుతున్నాయి. భద్రకాళి ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా పర్యాటక ప్రాంతంగా కూడా అభివృద్ధి చేయనున్నాం. భద్రకాళి బండ్ వద్ద పెండింగ్‌లో ఉన్న స్టోన్ వర్క్ పనులకు రూ.19 కోట్లతో టెండర్లు పిలిచాం. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అభివృద్ధి పనులను ఆయనకు చూపించే ఆలోచన ఉంది. వరంగల్ కోట చుట్టూ ఉన్న సుమారు 4 కిలోమీటర్ల రక్షణ కందకాన్ని పునరుద్ధరించి బోటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నాం. ఖిలా వరంగల్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రపంచ బ్యాంకు సహకారం తీసుకుంటున్నాం. నగరంలో ముంపు సమస్యను తగ్గించేందుకు రిటర్న్ వాల్, డ్రైనేజీలు, నాలాల అభివృద్ధి పనులు చేపడుతున్నాం. చారిత్రక కట్టడాలు, ఆలయాలు, సహజసిద్ధమైన ప్రాంతాలను అనుసంధానం చేస్తూ పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తున్నాం.

### దేవునూరు గుట్టలకు పర్యాటక శోభ

ధర్మసాగర్ మండలంలోని దేవునూరు గుట్టలను అటవీశాఖ సహకారంతో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే ఆలోచన ఉంది. ధర్మసాగర్ రిజర్వాయర్, అటవీ విస్తీర్ణం, సహజసిద్ధమైన గుట్టలను కలుపుకొని అభివృద్ధి చేస్తే ప్రజలకు ఆహ్లాదకరమైన పర్యాటక ప్రదేశం అందుబాటులోకి వస్తుంది. దీనిపై గతంలోనే ప్రతిపాదనలు రూపొందించామని, ప్రస్తుతం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి అవకాశాలను పరిశీలిస్తున్నాం. రహదారులు, సందర్శకులకు అవసరమైన సౌకర్యాలు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళిక రూపొందిస్తాం. ఈ ప్రాంతం అభివృద్ధి చెందితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.



### బయోమైనింగ్‌తో చెత్త సమస్యకు పరిష్కారం

నగరంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. శానిటేషన్ క్లియరెన్స్‌ను సవాల్‌గా తీసుకుని పనిచేస్తున్నాం. చెత్తను యథేచ్ఛగా డంపింగ్ చేయకుండా బయోమైనింగ్, బయో సీఎజీ ప్లాంట్ల ఏర్పాటుపై దృష్టి పెట్టాం. ప్రస్తుతం ఉన్న వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెస్ చేసే విధానాలను అమలు చేయనున్నాం. డంపింగ్ యార్డు విషయంలో కొత్తగా వెతుకులాట చేయడం లేదని, అందుబాటులో ఉన్న వ్యవస్థను సమర్థంగా వినియోగించుకునే ప్రయత్నం చేస్తున్నాం. నగర పరిశుభ్రత, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నాం.



ఉత్తరం కాకతీయ ఎడిటర్/
- కిరణ్ గౌడ్ అరెల్లి
7396604266

### ఐఏఎస్ కావాలన్న లక్ష్యంతో సివిల్స్‌లోకి

మధ్యప్రదేశ్‌లోని గుణలో టెన్త్ వరకు చదువుకున్నానని చాహత్ బాజ్‌పేయి తెలిపారు. ఇంటర్ విద్యను గ్వాలియర్‌లో పూర్తి చేశానని, 2016లో ఐఐటీ కాన్పూర్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశానని చెప్పారు. తన తండ్రి ఇంజనీరింగ్ విభాగంలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేశారని, ఉన్నతాధికారులతో ఆయనకు ఉన్న పరిచయాలు, కలెక్టర్ స్థాయి బాధ్యతల గురించి చెప్పే విధానం తనపై ప్రభావం చూపిందన్నారు. ప్రజలకు విస్తృతంగా సేవ చేసే అవకాశం సివిల్ సర్వీసుల్లో ఉంటుందని భావించి ఆ దిశగా అడుగులు వేశానని తెలిపారు. ఇంజనీరింగ్ చివరి సంవత్సరంలోనే తొలిసారి సివిల్స్ పరీక్ష రాశానని, మూడో ప్రయత్నంలో విజయం సాధించానని చెప్పారు. సివిల్స్ శిక్షణ సమయంలోనే తన భర్త ఐఏఎస్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డితో పరిచయం ఏర్పడిందని నవ్వుతూ తెలిపారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266